

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. మంచిర్యాల నుంచి టూర్ ప్యాకేజీలు అధికారులు ప్రకటించారు. పర్యాటక ప్రదేశాలకూ బస్సులు నడిపిస్తామని తెలిపారు. 8లో▸



సమస్యల స్వాగతం

బెల్లంపల్లి మున్సిపాలిటీలో సమస్యలు పేరుకుపోయాయి. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ తన్నీరు రమేష్‌కు సమస్యల పరిష్కారం సవాల్‌గా మారనుంది. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇందన్‌పల్లి ఎఫ్ఆర్వోగా శ్రీధరచారి



శ్రీధరచారి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి అటవీ రేంజ్ అధికారి(ఎఫ్ఆర్వో) కారం శ్రీని వాస్ బదిలీ అయ్యారు. ప్రభుత్వం డిప్యూటీ రేంజ్ అధికారులకు రేంజ్ అధికారులుగా పదోన్నతి కల్పించింది. దీంతో సిర్పూర్(టి) డీఆర్వో శ్రీధరచారిని పదోన్నతితో ఇందన్‌పల్లి రేంజ్ అధికారిగా నియమిస్తూ పీసీసీఎఫ్ సువర్ణ ఆదేశాలు జారీ చేశారు. ప్ర స్తుత ఇన్‌చార్జి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తిరిగి జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్వోగా చేరే అవకాశాలున్నాయి. జిల్లా టాస్క్‌ఫోర్స్‌లో రేంజ్ అధికారిగా పని చేసిన ఆయనకు గత ఏడాది అక్టోబర్ 14న ఇందన్‌పల్లి రేంజ్ అధికారిగా ఇంచార్జి బాధ్యతలు ఇచ్చారు. ఎనిమిది నెలల కాలంలో ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో ఇసుక, కలప అక్రమ రవాణాను అరికట్టారు. సిమెంటు ఇటుకల తయారీకి ఇసుక తరలించకుండా చర్యలు తీసుకున్నారు.

యూరియా కోసం బారులు



దుకాణం ఎదుట గుమిగూడిన రైతులు

నెన్నెల: మండల కేంద్రంలోని మహిళ రైతు ఉత్పత్తిదారుల కేంద్రం ఎదుట రైతులు యూరియా కోసం గురువారం ఉదయం నుంచి బారులు తీరారు. రైతులకు సరిపడా యూరియా నిల్వలు లేకపోవడం, ఎరువుల దుకాణాల్లో అధిక ధరలు, కొరత కారణంగా భారీగా తరలివచ్చారు. కేంద్రానికి వచ్చిన 260 బస్తాలు ఒక్కో రైతుకు మూడు చొప్పున ఇవ్వగా గంటలోనే అయిపోయాయి. బారులు తీరిన వారిలో కొందరికి యూరియా లభించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. యూరియా కొరత లేకుండా చూడాలని కోరారు.

షెట్టర్ల కేటాయింపుల్లో అక్రమాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: సమీకృత కూరగాయల మార్కెట్ షెట్టర్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విమర్శించారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వినోద్ అనుచరులు కొందరికి మార్కెట్‌తో సంబంధం లేకున్నా షెట్టర్లు కట్టబెట్టారని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్, కొందరు మాజీ ప్రజాప్రతినిధుల బంధువులకు మంజూరులో అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ శ్రేణులను మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైఠాయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రేవెల్లి విజయ్, పట్టణ యూత్ అధ్యక్షుడు అరుణ్, బీఆర్ఎస్, అనుబంధ సంఘాల శ్రేణులు చంద్రయ్య, అలీ, సాజిద్, వాజిద్, సుభాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి



బురద రోడ్డులో బీజేపీ నాయకులు

చెన్నూర్‌రూరల్: వారం రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో తాత్కాలిక మరమ్మతు చేయిస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ అన్నారు. గురువారం మండంలోని గంగారం గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ మంత్రి వివేక్ ఆధ్వర్యంలో రోడ్డు పనులు ప్రారంభించారని, ఇంతవరకు నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆలం బాపు, మంత్రి రామయ్య, నాయకులు కాశెట్టి నాగేశ్వర్‌రావు, కొటారి వెంకటేశ్, దుర్గం రాజబాపు, కుడుదుల రాజన్న పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వంలోనే ప్రగతి

- అర్హులకు సంక్షేమ ఫలాలు అందించాలి
- దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక నంబర్
- మంత్రులు జూపల్లి కృష్ణారావు, జీ.వివేక్
- ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం
- నాలుగు గంటలు కొనసాగిన సమావేశం



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, వేదికపై మంత్రి వివేక్, ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు శంకర్, మహేశ్వర్‌రెడ్డి, కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, రామారావుపటేల్, కలెక్టర్లు

సాక్షి, ఆదిలాబాద్/కై లాస్‌నగర్: ప్రజాప్రభుత్వంలోనే రాష్ట్రం ప్రగతిపథంలో ముందుకెళ్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, మైనింగ్ శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందించే బాధ్యత అధికారులేదనని చెప్పారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన తర్వాత తొలిసారి జూపల్లి కృష్ణారావు, మరో మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి గురువారం ఆదిలాబాద్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును స్పష్టం చేస్తూ అధికా రులు ఎలా ముందుకెళ్లాలో దిశానిర్దేశం చేశారు. మొదట వ్యవసాయ శాఖపై సుదీర్ఘంగా సమీక్షించారు. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారికి జైలు శిక్ష పడేలా కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలకు సూచించారు. ఇక నుంచి జిల్లాల వారీగానే సమీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం స్వయం సహాయక సంఘాల్లోని మృతుల కుటుంబీకులకు మంజూరైన రూ.10లక్షల ఆర్థికసాయం చెక్కులు పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు జాదవ్ అనిల్‌కుమార్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడారు. ఈ సమావేశంలో నాలుగు జిల్లాల కలెక్టర్లు రాజర్షి షా, కుమార్ దీపక్, అభిలాష అభినవ్, వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకీ షర్మిల, కాంతిలాల్, అడిషనల్ కలెక్టర్లు, ట్రైనీ కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మంత్రులకు ఘన సన్మానం

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన జూపల్లి కృష్ణారావుతోపాటు ఇటీవలే మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఉమ్మడి జిల్లాకు చెందిన వివేక్ తొలిసారి జిల్లాకు రాగా, వీరిని ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్‌జాదవ్, కోవ లక్ష్మి, కలెక్టర్ రాజర్షి షా శాలువాలతో సత్కరించారు. జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు.

మంచిర్యాల ఎమ్మెల్యే గైర్హాజరు

ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు గైర్హాజరయ్యారు. గైర్హాజరుపై పలువురు చర్చించుకోవడం కనిపించింది.

సీఆర్ఆర్ ఇంటికి వెళ్లిన 'జూపల్లి'

మంత్రి జూపల్లి కృష్ణారావు పట్టణంలోని శాంతినగర్‌లో మాజీ మంత్రి, దివంగత చిల్కూరి రామచంద్రారెడ్డి ఇంటికి వెళ్లారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మేనల్లుడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవరెడ్డిని పరామర్శించారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మి అలక

సమావేశం ప్రారంభమయ్యాక కాసేపటికి వేదికపైకి వచ్చిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుర్చీ లేకపోవడంతో కొద్దిసేపు నిల్చునే ఉన్నారు. జెడ్పీ సిబ్బంది వెంటనే కుర్చీ తీసుకువచ్చి వేయగా ఆసీనులయ్యారు. ఈ తర్వాత ఏమనుకున్నారో తెలియదు గాని ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి వేదిక దిగి అధికారుల కుర్చీల్లో కూర్చున్నారు. మంత్రి ప్రసంగిస్తున్న సమయంలో దీన్ని గమనించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోవ లక్ష్మి వద్దకు వచ్చి తన సీట్లో కూర్చోవాలని కోరారు. మంత్రి కూడా ఆహ్వానించడంతో తిరిగి వేదికపైకి వచ్చి అనిల్ జాదవ్ సీట్లో కూర్చున్నారు.

చిత్తశుద్ధితో పథకాలు అమలు చేస్తున్నాం



ఎన్ని అడ్డంకులొచ్చినా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. 18 నెలలుగా గత ప్రభుత్వం చేసిన అప్పు కింద ప్రతీనెల రూ.6,500 కోట్లు చెల్లిస్తున్నాం. అయినా రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశాం. రైతుభరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తున్నాం. రుణమాఫీకి నోచుకోని రైతులకు సింగిల్ విండో కౌంటర్ ఏర్పాటు చేసి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నాం. భూభారతి చట్టం ద్వారా వివిధ దశల్లో తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు అధికారం ఇవ్వడం ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. చట్టాలు చేసేది మేమే అయినప్పటికీ వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదే. సంక్షేమ పథకాల లబ్ధి కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక వాట్సాప్ నంబర్ క్రియేట్ చేయాలి. బాధితులు సమస్యలు లిఖితపూర్వకంగా సదరు నంబర్‌కు వాట్సాప్ చేస్తే పరిష్కరించేలా కలెక్టర్లు మానిటరింగ్ చేయాలి. సమస్యలు నిర్ణీత సమయంలో పరిష్కారం కాకుంటే తొలుత మౌఖికంగా, ఆ తర్వాత లిఖితపూర్వకంగా సంబంధిత అధికారులను వివరణ కోరాలి. అప్పటికీ పరిష్కారం కాకుంటే బాధ్యులపై చర్య తీసుకోవాలి. నకిలీ విత్తనాలు సరఫరా చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేస్తూ అభివృద్ధిలో మెరుగైన ఫలితాలు సాధించాలి.

– జూపల్లి కృష్ణారావు, ఇన్‌చార్జి మంత్రి

కమిట్‌మెంట్‌తో పనిచేయాలి



ఆదివాసీలతో పాటు భౌగోళికంగా విస్తీర్ణం కలిగిన జిల్లాలో సమస్యలు అధికంగానే ఉంటాయి. వాటి పరిష్కారానికి చొరవ చూపాలి. ప్రజలకు సేవ చేయాలనే కమిట్‌మెంట్‌తో పనిచేయాలి. గృహజ్యోతి సమస్యల పరిష్కారం కోసం సింగిల్ విండో కౌంటర్‌ను ఏర్పాటు చేస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ అమలు ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాం. విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి రూ.200 కోట్లతో 100 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నాం. పేదలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి. గ్యాస్ సబ్సిడీ సక్రమంగా అందేలా చూడాలి. సమస్యలు తెలిపితే సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తాం.

– గడ్డం వివేక్, రాష్ట్ర కార్మిక, మైనింగ్‌శాఖ మంత్రి

నియోజకవర్గాల వారీగా సమీక్షించాలి



పంట సాగు సమయంలోనే రైతు భరోసా నిధులు విడుదల చేయడం హర్షణీయం. రైతులకు లబ్ధి చేకూర్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. అలాగే రోడ్లు, మున్సిపల్, అటవీ సంబంధిత సమస్యలపై నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలతో మంత్రులు సమీక్షలు నిర్వహించాలి. దీంతో అక్కడి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు వీలు కలుగుతుంది.

– గడ్డం వినోద్, బెల్లంపల్లి ఎమ్మెల్యే

అధికారుల తీరు సరికాదు



జిల్లాలో పోడు, రెవెన్యూ భూముల సమస్య ప్రత్యేక సర్వే నిర్వహిస్తేనే పరిష్కారమవుతుంది. కడెం, దస్తురాబాద్ మండలాల్లో అటవీ అధికారులతో తీవ్ర ఇబ్బందులెదురవుతున్నాయి. పీపీ ల్యాండ్స్ సాగు చేస్తున్న గిరిజనేతరులకు గతంలో పహాణీల ద్వారా రుణాలందేవి. 30–40 ఏళ్లుగా సాగు చేస్తున్న గిరిజనేతరులకు ప్రత్యామ్నాయం చూపాలి. అటవీ అధికారులు అభివృద్ధి పనులు అడ్డుకుంటుండగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారులను ఇతర జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి.

– వెడ్మ బొజ్జుపటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే

స్థానిక సమరానికి సిద్ధం!



హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

- పోటీ చేసే స్థానాలపై ప్రణాళికలు
- ముందుగానే కర్చీఫ్‌లు వేస్తున్న నాయకులు
- రిజర్వేషన్లు తేలితే పల్లెల్లో ఎన్నికల వేడి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/మంచిర్యాలరూరల్ (హాజీపూర్): గ్రామ పంచాయతీ ఎన్నికల సమరానికి నాయకులు సిద్ధం అవుతున్నారు. వచ్చే సెప్టెంబర్‌లోపు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆ మేరకు నాయకులు సంస్థాగతంగా సన్నద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ పేపర్ల వరకు అంతా సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరో 90రోజులు గడువు ఉండడంతో నాయకులు క్షేత్రస్థాయిలో అంతా సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రభుత్వ పథకాల్లో వేగిరం

అధికార కాంగ్రెస్ పార్టీ సానుకూలతను పెంచేందుకు ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచారు. ఇప్పటికే రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హుల ఎంపిక సాగుతుండగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులతో ముగ్గు పోయిస్తూ నిర్మాణాలు వేగిరం చేస్తున్నారు. మరోవైపు రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందజేశారు. భూభారతి అమలు చేసి భూ సమస్యలు పరిష్కరిస్తున్నారు. దీంతో ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూలతను పెంచుతూ వచ్చే పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. అంతేగాక శ్రేణులను సన్నద్ధం చేసుకుంటూ పార్టీలో రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులు భర్తీ చేస్తున్నారు.

పోరాడేందుకు ప్రతిపక్షాలు

రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతను చూపిస్తూ స్థానిక సంస్థల్లో లబ్ధి పొందేలా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. ఇందిరమ్మ ఇళ్లు రాని బాధితులు, రాజీవ్ యువ వికాసం నిబంధనలు, భూ భారతిలో సమస్య పరిష్కారం, ఆరు గ్యారంటీల అమలు వంటివి జాప్యంపై ఇప్పటికే వినతులు, నిరసనలు చేపడుతున్నారు. తమ పార్టీల ప్రతినిధులతో కలిసి నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ఆయా పథకాల అమలు తీరుపై ఎండగడుతున్నారు. ప్రజావ్యతిరేకతను తీసుకొచ్చి వచ్చే పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో లబ్ధిపొందేలా ప్రణాళికలు వేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకులు జిల్లాలో పర్యటిస్తూ పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోరాటానికి సిద్ధమవుతున్నారు.

జిల్లాలో గ్రామీణ ఓటర్లు

మహిళలు	1,90,828
పురుషులు	1,85,956
ఇతరులు	19
మొత్తం	3,76,803

కర్చీఫ్ వేసుకుంటున్న నాయకులు

రిజర్వేషన్ తేలకముందే ఆయా స్థానాల్లో పోటీ చేసేందుకు నాయకులు కర్చీఫ్‌లు వేసుకుంటున్నారు. తాము బరిలో ఉంటామనే సంకేతాలు ఇస్తున్నారు. జనరల్, మహిళా, ఎస్సీ, ఎస్టీ విభాగాల్లో ఆయా నాయకులు రిజర్వేషన్లు ఉన్నవారు తమకు అనుకూలంగా ఉన్న చోట్ల బరిలో ఉంటారని ప్రజల్లో చెప్పుకుంటున్నారు. అయితే రిజర్వేషన్లు తేలాక, ముందు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారా? లేక పరిషత్ ఎన్నికలా? అనే స్పష్టత కోసం చూస్తున్నారు. ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలు ఉండడంతో పోటీలో ఉండబోయే నాయకులు స్థానిక ఎమ్మెల్యేలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఇంకా కొందరు ఏ పార్టీ నుంచి ఉండకుండా తటస్థంగా ఉంటూ సమయాన్ని బట్టి పార్టీ మద్దతు కోరే యోచనలో ఉన్నారు.

జిల్లాలో..

గత ఏడాది ఫిబ్రవరి 2నాటితో పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. 17నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. హైకోర్టు ఆదేశాలతో పంచాయతీ ఎన్నికలపై చర్చ మొదలైంది. జిల్లాలోని 306 గ్రామ పంచాయతీల్లో 2,680 వార్డులు ఉన్నాయి. 16మండలాల్లో మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించారు. పంచాయతీ ఎన్నికలు బ్యాలెట్ విధానంలో నిర్వహించనుండగా.. జిల్లాలో 3,777 బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయి. 2019జనవరిలో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులతోపాటు మహారాష్ట్రకు చెందిన బ్యాలెట్ బాక్సులను వినియోగించనున్నారు. ఇప్పటికే బ్యాలెట్ బాక్సుల మరమ్మతు పూర్తి చేసి పోలింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉంచారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే పంచాయతీల వారీగా పంపిస్తారు. బ్యాలెట్ పేపర్లు సైతం సిద్ధంగా ఉంచారు.

డివిజన్ల విభజనపై ఉత్కంఠ

- వెలువడని కార్పొరేషన్ జాబితా
- ఆశావహుల ఎదురుచూపులు



మంచిర్యాల నగర పాలక సంస్థ కార్యాలయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్ల పునర్విభజనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నెల 21న జాబితా విడుదల కావాల్సి ఉండగా.. జాప్యం జరుగుతుండడంతో ఉత్కంఠను రేకెత్తిస్తోంది. మంచిర్యాల మున్సిపాలిటీలో నస్పూర్ మున్సిపాలిటీతోపాటు హాజీపూర్ మండలం వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, నర్సింగాపూర్, చందనాపూర్, కొత్తపల్లి, పోచంపాడ్ గ్రామాలను విలీనం చేసి ఈ ఏడాది జనవరిలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. ఇన్నాళ్లు వార్డులు, గ్రామాలుగా ఉన్న వాటన్నింటినీ కలిపి భౌగోళికంగా, ఓటర్ల సంఖ్యను బట్టి మొత్తం 60డివిజన్లుగా మార్చి అధికారులు ముసాయిదా జాబితా విడుదల చేశారు. విభజన ప్రతిపాదనలపై నోటీసులు నోటీసులు ఇవ్వడంతోపాటు సాధారణ ప్రజలు, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు లేఖలను ఈ నెల 4వరకు అందజేశారు. 5నుంచి 11వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు, సలహాలను రాతపూర్వకంగా స్వీకరించారు. ఈ నెల 12నుంచి 16వరకు పరిష్కరించేలా విచారణ చేపట్టి, ఆమోదించిన అభ్యంతరాల ప్రకారం డివిజన్లను కొంత మార్చి కలెక్టర్ ఆమోదం కోసం ఈ నెల 18న పంపించారు. 19న పురపాలక శాఖకు, అక్కడి నుంచి 20న ప్రభుత్వానికి నివేదిక చేరింది. ప్రభుత్వ పరిశీలన అనంతరం తుది జాబితా 21న విడుదల కావాల్సి ఉండగా.. ఇప్పటికీ వెలువడకపోవడంతో ప్రజల్లో, అభ్యంతరాలు వ్యక్తం చేసిన వారిలో ఉత్కంఠ నెలకొంది.

అభ్యంతరాలు.. మార్పులు

భౌగోళికంగా డివిజన్లు సక్రమంగా లేవని, వాటిని మళ్లీ సవరించాలని 38 అభ్యంతరాలు వచ్చాయి. నగరపాలక సంస్థ అధికారులు సిబ్బంది పరిశీలించి అందులో 19 అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుని మార్పులు చేశారు. మరో 13 అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదు. ఆరు అభ్యంతరాలు పాక్షిక మార్పులు చేశారు. వచ్చిన అభ్యంతరాల్లో ఎక్కువగా ఒక కాలనీ రెండు నుంచి నాలుగు డివిజన్లలోకి రావడం, కొన్ని ఇళ్ల నంబర్లు తప్పిపోవడం, కొన్ని కాలనీలు డివిజన్లలో కనిపించకపోవడం వంటివి అధికారులు గుర్తించారు. డివిజన్ల సరిహద్దులు స్వల్పంగా మారనుండగా ఓటర్ల జాబితా, డివిజన్‌లోని కాలనీల సరిహద్దుల్లో మార్పులు చేశారు.

సామాజిక మాధ్యమాల్లో జాబితా

ప్రభుత్వం, అధికారుల నుంచి కార్పొరేషన్ డివిజన్ల జాబితా విడుదల కాకముందే సామాజిక మాధ్యమాల్లో ఇవే డివిజన్లు అంటూ ప్రచారం జరుగుతోంది. ఈ నెల 3న ప్రకటించిన జాబితా, సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుగున్న జాబితాకు కొంత మార్పు ఉండడంతో నిజమే కావొచ్చని భావిస్తున్నారు. తమ డివిజన్ ఎక్కడ వస్తుందనే ఆసక్తితోపాటు ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారి ఏ ఏరియా నుంచి ఎక్కడి వరకు కలిసిందని ఆరా తీస్తున్నారు. జాబితా కొంత గందరగోళంగా ఉండడంతో ప్రభుత్వం తాత్సారం చేయకుండా జాబితా విడుదల చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

బెల్లంపల్లి: పాలిసెట్–2025 ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ ప్రక్రియను కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా డీఎస్‌వో కే.మధుకర్ బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దేవేందర్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కౌన్సెలింగ్ నిరాటంకంగా సాగింది. తొలుత విద్యార్థులను కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక గదిలోకి పంపించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకున్నారు. సర్టిఫికేట్లు పరిశీలించి ధ్రువీకరించారు. పాలిటెక్నిక్ కోర్సులు, వెబ్ ఆప్షన్ల నమోదు తదితర అంశాలపై అవగాహన కలిపించారు. తొలిరోజు కౌన్సెలింగ్‌కు 360మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ దేవేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల వివిధ బ్రాంచ్‌ల హెడ్‌లు బి.వెంకటేశ్వర్లు, ఎస్.నాగరాజు, వర్క్‌షాప్ సూపరింటెండెంట్ డి.రాందాస్, కౌన్సెలింగ్ ఇంచార్జీ టి.మధుకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీఎన్జీవోస్ సభ్యులు



మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామిని టీఎన్జీవోస్ నాయకులు గురువారం మంచిర్యాలలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఉద్యోగుల సమస్యలపై వివరించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రమ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

- డ్రగ్స్ నివారణకు అందరూ కృషి చేయాలి
- మంచిర్యాల ఏసీపీ ప్రకాష్



ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ ప్రకాష్

మంచిర్యాలక్రైం: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పని చేయాలని మంచిర్యాల ఏసీపీ రత్నపురం ప్రకాష్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని మంచిర్యాలలో అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల సమన్వయంతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐబీ చౌరస్తా నుంచి ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం వరకు ర్యాలీ సాగింది. బెల్లంపల్లి చౌరస్తాలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏసీపీ ప్రకాష్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం ద్వారా యువత భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని అన్నారు. మత్తుకు బానిసైన కొందరు ఆత్మహత్యకు పాలపడుతున్నారని, మరికొందరు అనారోగ్యంతో మృత్యువాత పడుతున్నారని తెలిపారు. క్యాలెండర్, యాంటి డ్రగ్స్ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రమోద్‌రావు, రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎక్సైజ్ సీఐ గురువయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వంగ చక్రపాణి, సీడీపీవో రేష్మ, శ్రావణి, ఎఫ్ఆర్ఓ ఫర్జానా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శివాలయంలో చోరీకి యత్నం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ శివకోటి ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఆలయం తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు హుండీని పగులగొట్టేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. హుండీ తాళాలు పగలకపోవడంతో బయటే వదిలేసి పారిపోయారు. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు గురువారం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పట్టణంలో జరుగుతున్న వరుస చోరీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నకిలీ బాబా అరెస్ట్

ఇచ్చోడ: తాయత్తులతో వ్యాధులు, రోగాలు నయమవుతాయని నమ్మిస్తూ అమాయక ప్రజలు, ఆదివాసీలను మోసం చేస్తున్న నకిలీ బాబాను గురువారం అరెస్టు చేసినట్లు ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలిపారు. ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ తాయత్తులతో రోగాలు నయం చేస్తానంటూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నాడన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. అనారోగ్య సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇలాంటి బాబాలు గ్రామాల్లో ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలిస్తే జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని, వారిపై చర్యలను తీసుకుంటామన్నారు.

పాలేరును చితకబాదిన యజమాని..

- అవమానం తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం..



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేశ్

సోన్: యజమాని చితకబాదాడని అవమానం తట్టుకోలేక పాలేరు ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి అనే రైతు వద్ద కుబీర్ మండలం మాలేగం గ్రామానికి చెందిన రాపని రమేశ్ నాలుగేళ్లుగా పాలేరుగా పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా పనికి రాక పోవడంతో ఆగ్రహించిన శ్రీనివాసరెడ్డి మరో ఇద్దరితో కలిసి మంగళవారం పాలేరును చితకబాదారు. దీంతో అవమానం తట్టుకోలేని పాలేరు పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం రమేశ్ పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

- పర్యాటక ప్రదేశాలకూ సర్వీసులు
- మంచిర్యాల నుంచి టూర్ ప్యాకేజీలు
- 36 మంది ప్రయాణికులుంటే చాలు

మంచిర్యాలఅర్బన్: ఆదాయాన్ని రాబట్టి లాభాల బాట పట్టేలా అన్ని మార్గాలనూ ఆర్టీసీ అన్వేషిస్తోంది. విహారయాత్రలు, శుభకార్యాలకు వెళ్లాలనుకుంటే ఇళ్ల వద్దకు బస్సులు పంపుతోంది. తాజాగా టూర్ ప్యాకేజీలపై దృష్టి సారించింది. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికులను ఆకట్టుకున్న ఆర్టీసీ పుణ్యక్షేత్రాల దర్శనం, పర్యాటక ప్రదేశాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు నిర్ణయించింది. తక్కువ చార్జీలతో భక్తులను ఆలయాలకు తీసుకెళ్లి తీసుకొస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఆరు గంటలకు మంచిర్యాల బస్టాండ్ నుంచి బస్సు బయల్దేరి ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, గూడెం సత్యనారాయణస్వామి ఆలయం, గాంధారిఖిల్లా, శివ్వారం(మొసళ్ల చెరువు), త్రివేణి సంగమమైన కాళేశ్వర ముక్తేశ్వర ఆలయాలను దర్శించుకుని రాత్రి 8 గంటలకు మంచిర్యాలకు చేరుకుంటుంది. పెద్దలకు రూ.530, పిల్లలకు రూ.290 చార్జీలు ప్రకటించారు. భోజన, ఇతర ఖర్చులు ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది.



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు

36 మంది సిద్ధంగా ఉంటే..

36 మంది ప్రయాణికులు సిద్ధంగా ఉంటే పుణ్యక్షేత్రాలకు ఏ రోజైనా బస్సులు నడపనుంది. మంచిర్యాల బస్టాండ్ నుంచి బస్సు బయల్దేరి కొమురవెల్లి, చేర్యాల, ఆలేరు, కొలనుపాక, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి వెళ్లనుంది. సూపర్‌లగ్జరీ బస్సు ద్వారా కొమురవెల్లి ఆలయం తర్వాత వయా చేర్యాల, ఆలేరు మీదుగా కొలనుపాక చేరుకుని జైన దేవాలయం సందర్శన ఉంటుంది. అక్కడి నుంచి యాదగిరిగుట్ట చేరుకుని నృసింహస్వామి ఆలయ దర్శనం, అనంతరం స్వర్ణగిరి ఆలయ సందర్శన ఉంటుంది.

ప్రయాణికుల కోసం ప్రత్యేకం

మంచిర్యాల డిపో ప్రత్యేక టూర్‌ప్యాకేజీ ఏర్పాటు చేసింది. టికెట్ ధర పెద్దలకు రూ.1300, పిల్లలకు రూ.700గా నిర్ణయించాం. ఏరోజైనా బస్సులు నడుపుతాం. శనివారం ఒక బస్సు డిపో నుంచి వెళ్లేలా చూస్తాం. దర్శనం, అల్పాహారం, భోజనాలు, ఇతరత్రా ఖర్చులు ప్రయాణికులే భరించాల్సి ఉంటుంది. బుకింగ్ కోసం 9959226004 నంబరులో సంప్రదించాలి.

– శ్రీనివాసులు, డీఎం, మంచిర్యాల

భర్త చేతిలో భార్య హతం

- జాతీయ రహదారిపై కుటుంబ సభ్యుల రాస్తారోకో
- నిందితుడిని అరెస్టు చేయాలని డిమాండ్



సుజాత (ఫైల్)

నేరడిగొండ: భర్త చేతిలో భార్య హతమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని దర్బాతాండకు చెందిన ఆడె నటరాజన్‌కు 2021లో మామడ మండలం గాయిదిపల్లికి చెందిన సుజాత (25)తో వివాహమైంది. మండల కేంద్రంలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న నటరాజన్ కోరమండల్ కంపెనీలో పనిచేస్తుండగా సుజాత టైలరింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. బుధవారం రాత్రి దంపతుల మధ్య గొడవ చోటు చేసుకుంది. క్షణికావేశంలో గొంతునొక్కడంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు గురువారం ఉదయం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తరచూ అదనపు కట్నంకోసం వేధిస్తుండేవాడని, ఈక్రమంలో హత్య చేశాడని ఆరోపించారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఏఎస్పీ కాజల్ సింగ్ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. అనంతరం పోలీసులు బాధిత కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పూర్తి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. తల్లి మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కాగా బోథ్ నుంచి మృతదేహాన్ని ఆదిలాబాద్ రిమ్స్‌కు పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఏఎస్పీ

కేయూ డిగ్రీ సెమిస్టర్ల ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న అధికారులు

- ఐదో సెమిస్టర్‌లో 50.56 శాతం..
- ఆరో సెమిస్టర్‌లో 50.16 శాతం ఉత్తీర్ణత

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఏప్రిల్, మేలో నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బి ఒకేషనల్, బీఏ ఎల్ ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం విడుదల చేశారు. ఐదో సెమిస్టర్ ఫలితాల్లో 13,963 మందికి గానూ 7,059 మంది (50.56 శాతం), ఆరో సెమిస్టర్‌లో 37,999 మందికి గానూ 19,060 మంది (50.16శాతం) ఉత్తీర్ణులయ్యారని పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ తెలిపారు. ఆయా పరీక్షల ఫలితాలను కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు తిరుమలాదేవి, వెంకటయ్య, సౌజన్య, పద్మజ, ఆసిం ఇక్బాల్, నాగరాజు, కేయూ అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఆయా డిగ్రీ కోర్సుల సెమిస్టర్ల విద్యార్థులకు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 15 రోజుల సమయం ఉంటుంది. ఆన్‌లైన్‌లోనే సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు.

త్వరలో 2, 4 సెమిస్టర్ల వాల్యుయేషన్ ప్రక్రియ..

డిగ్రీ కోర్సుల రెండు, నాలుగు, ఐదవ, ఆరవ సెమిస్టర్ల పరీక్షలు ఒకేసారి జరిగినా తొలుత ఫైనలియర్ విద్యార్థులకు సంబంధించిన ఆరవ సెమిస్టర్ పరీక్షలు, బ్యాక్‌లాగ్ ఐదవ సెమిస్టర్ పరీక్షల జవాబుపత్రాలు మూల్యాంకనం చేయించారు. తద్వారా ఆయా విద్యార్థులు వివిధ ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉంటుంది. వాస్తవంగా ఈసారి ప్రైవేట్ యాజమాన్యాలకు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో పరీక్షల ఫీజులు చెల్లించడంలో జాప్యం చేసిన విషయం తెలిసిందే. దీంతో పరీక్షలు ఆలస్యంగా జరిగాయి. 2, 4 సెమిస్టర్ల పరీక్షల జవాబు పత్రాలకు సంబంధించిన మూల్యాంకనం త్వరలోనే నిర్వహించనున్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మహిళను మోసగించిన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు జైనథ్ మండలంలోని మాకోడ గ్రామానికి చెందిన రాచర్ల హీరక్క ఈనెల 24న ఆదిలాబాద్ పట్టణంలోని నటరాజ్ థియేటర్ వద్దకు వచ్చింది. అక్కడి నుంచి సుభాష్‌నగర్‌లో ఉన్న తన మనుమని వద్దకు వెళ్లేందుకు ప్యాసింజర్ ఆటోలో ఎక్కింది. డ్రైవర్ సుభాష్‌నగర్ వైపు వెళ్లకుండా ఆటోను తాంసి బస్టాండ్‌వైపు మళ్లించాడు. దీంతో సదరు మహిళ కేకలు వేయగా ఆమె వద్ద ఉన్న సంచి, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లాడు. సంచిలో రూ.17,500 నగదు ఉన్నట్లు మహిళ వాపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అసత్య ప్రచారం చేసిన ఒకరిపై..

నెన్నెల: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసిన బెల్లంపల్లి మండలం చాకెపల్లికి చెందిన దుర్గం రవిపై గురువారం కేసు నమోదు చేసినట్లు నెన్నెల ఎస్సై ప్రసాద్ తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నాడని నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన అత్తిని బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

గుడిహత్నూర్: విలేకరినని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సై మధుకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సీతాగోందికి చెందిన అరుగుల సంతోష్ తాటికల్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం భూమేశ్ అనే వ్యక్తి ఫోన్‌చేసి తాను విలేకరినని, మీరు కల్తీ మద్యం విక్రయిస్తున్నారని, రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో సంతోష్ సదరు వ్యక్తికి రూ.2వేలు ఇచ్చినట్లు తెలిపాడు. కాగా ఈ విషయాన్ని బాధితుడు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో విచారణ చేపట్టిన పోలీసులు సదరు విలేకరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

స్పోర్ట్స్ అర్హత పరీక్షకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో శ్రీధర్‌రెడ్డి

వేమనపల్లి: మంచిర్యాల క్రీడా ప్రాతిపాదిక సంస్థ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన క్రీడా పాఠశాల ఎంపిక పోటీలలో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, పీఈటీ మల్లేశ్ తెలిపారు. ఎంపికైనవారిలో అంజన్న (కల్మలపేట), ఎం.వర్షిణి (కొత్తపల్లి), శ్రీహిత (గెర్రెగూడం), శ్రీజ (సుంపుటం), జి.హారిక (కేతన్‌పల్లి), ఏ. మేఘన (కొత్తపల్లి) ఉన్నారు.

తాంసిలో క్లోరల్‌హైడ్రేట్ పట్టివేత

తాంసి: మండల కేంద్రం శివారులో ఉన్న ఓ పశువుల పాకలో రెండు రోజుల క్రితం 20 కిలోలకు పైగా నిషేధిత క్లోరల్‌హైడ్రేట్‌ను ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్న ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలానికి చెందిన ఓ వ్యక్తి నిర్మల్, నిజామాబాద్ జిల్లాల నుంచి క్లోరల్‌హైడ్రేట్‌ను ఆదిలాబాద్‌కు తీసుకొచ్చి గ్రామాల వారీగా ఆయా దుకాణాలకు చేరవేస్తున్నట్లు తెలిసింది. సమాచారం తెలుసుకున్న అబ్కారీ బృందం ఘటన స్థలానికి చేరుకొని పెద్ద ఎత్తున నిషేధిత క్లోరల్‌హైడ్రేట్ పట్టుకున్నారు. అధికారులు ఈ విషయం బయటకు రానివ్వకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం బయటకు రాకుండా అధికారులు గోప్యత పాటించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ విజేందర్‌ను సంప్రదించగా గ్రామ శివారులో ఖాళీగా ఉన్న స్థలంలో కేవలం ఐదు కిలోలు మాత్రమే పట్టుకున్నట్లు తెలిపారు. దీనిపై విచారణ చేపట్టిన అనంతరం సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేస్తామన్నారు.

మానవ అక్రమ రవాణా కేసులో కానిస్టేబుల్ డిస్మిస్

- నిందితుడిపై మూడు కేసులు
- 2022 నుండి విధులకు గైర్హాజరు
- ఎస్పీ కాంతిలాల్ పాటిల్



ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మానవ అక్రమ రవాణా కేసుల్లో నిందితుడిగా ఉన్న కానిస్టేబుల్ కామెర హరిదాస్‌ను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. 2019లో తిర్యాణిలో ఓ గిరిజన మహిళను మధ్యప్రదేశ్‌లో విక్రయించిన కేసులో హరిదాస్ నిందితుడు. అలాగే ఈ ఏడాది ఓ ఆదివాసీ గిరిజన మహిళను ఇద్దరు మధ్యవర్తుల సాయంతో మధ్యప్రదేశ్‌లో విక్రయించాడు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితుల్లో హరిదాస్ ఏ5గా ఉన్నాడు. అలాగే ఈ నెల 6న ఓ మహిళ మిస్సింగ్ కేసులో ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా, మధ్యప్రదేశ్‌లో బాధితురాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాధిత మహిళ ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం గుర్తించిన నలుగురు నిందితుల్లో హరిదాస్ ఏ1గా ఉన్నాడు. ఈ నెల 16న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 1989 పోలీస్ కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన హరిదాస్ 2019లో తిర్యాణి కేసు అనంతరం సస్పెండ్ అయ్యాడు. అనంతరం 2020లో చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరాడు. 2022 నుంచి 2025 జూన్ 15 వరకు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యాడు. తాజాగా మళ్లీ మానవ అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడటంతో అతడిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించినట్లు ఎస్పీ తెలిపారు.

ఆర్జీయూకేటీలో ధ్రువపత్రాల పరిశీలన

బాసర: బాసర ఆర్జీయూకేటీలో ఫిజికల్ హ్యాండీక్యాప్, సాయుధ బలగాల కోటా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను గురువారం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ కోటాలో హెరింగ్ ఇంపెయిర్, మెంటల్ రిటార్డేషన్, మల్టిపుల్ డిసార్డర్స్, ఆర్థోపెడిక్ డిసెబిలిటీస్, విజువల్ ఇంపెయిర్డ్ వంటి విభిన్న దివ్యాంగ విద్యార్థులు హాజరయ్యారు. వీరి ధ్రువీకరణను జిల్లా ప్రభుత్వ వైద్యుల బృందం నిర్వర్తించింది. సాయుధ బలగాల సిబ్బందికి చెందిన పిల్లల పత్రాల పరిశీలనను సంబంధిత సాయుధ శాఖల అధికారుల పర్యవేక్షణలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధృవీకరణ ప్రక్రియ పూర్తయిన విద్యార్థుల ప్రొవిజనల్ సెలెక్టెడ్ లిస్ట్‌ను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు. జూలై 4న ప్రొవిజినల్లీ సెలెక్టెడ్ లిస్ట్ రిలీజ్ చేస్తామన్నారు. మొదటి విడత కౌన్సెలింగ్ జూలై 7న ప్రారంభమవుతుందని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్షన్, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కో కన్వీనర్లు డాక్టర్ దేవరాజు, డాక్టర్ విట్టల్, రాకేష్‌రెడ్డి, హరికృష్ణ మంతపురి, బద్రి నారాయణ, మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

రెండు లారీలు ఢీ..డ్రైవర్ మృతి

- మరో డ్రైవర్‌కు తీవ్రగాయాలు



శ్రీనివాస్ (ఫైల్)


లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందగా మరో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. దేవపూర్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్తున్న సిమెంటు ట్యాంకర్ సంతూర్ సబ్బుల లోడ్‌తో హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్ బయలుదేరిన లారీ ఇటిక్యాల సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్ కావడంతో విషయం తెలుసుకున్న సీఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్ క్రేన్ సహాయంతో వాహనాలను పక్కకు జరిపించారు. ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ కాసిపేట మండలం పలాంగూడకు చెందిన శ్రీనివాస్ (52) క్యాబిన్‌లో ఇరుక్కుని మృతి చెందాడు. క్రేన్ సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ సచిన్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాలలోని ప్రైవే టు ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాస్ భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



సంఘటన స్థలంలో నుజ్జునుజ్జయిన లారీ


వేలాల గట్టు మల్లన్న గుట్టపై గిరిప్రదక్షణ

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల గట్టు మల్లన్నస్వామి సన్నిధిలో గురువారం 9వ గిరి ప్రదక్షణ కార్యక్రమం వైభవంగా చేపట్టారు. చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ కుమారులు శ్రేయాంష్ మహారాజ్ ఆధ్వర్యంలో గట్టు మల్లన్న స్వామి గుట్టపైన గిరిప్రదక్షణ చేపట్టారు. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గిరిప్రదక్షణలో పాల్గొని దొణలో స్వయంబువుగా వెలిసిన గట్టు మల్లన్న స్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపై భక్తుల సందడి నెలకొంది. అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.



గట్టుపై గిరిప్రదక్షణ చేస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో సీనియర్ అసిస్టెంట్ మృతి



సూర్యకుమార్ మృతదేహం

జైపూర్: మండలంలోని ఇందారం అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో రాజీవ్ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జాదవ్ సూర్యకుమార్ (30) మందమర్రిలో నివాసం ఉంటున్నాడు. మందమర్రికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ పిల్లి వెంకటేశ్‌తో కలిసి బుధవారం రామగుండం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా వీవో షోరూం సమీపంలో అడ్డువచ్చిన అడవిజంతువును తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నారు. ఘటనలో బైక్ నడుపుతున్న సూర్యకుమార్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న వెంకటేశ్‌కు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సూర్యకుమార్ భార్య రాజశ్రీ సింగరేణిలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తోంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై అబీబ్ తెలిపారు.

ఇసుక వేలం

బెల్లంపల్లి: అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తూ పట్టుబడిన ఇసుకకు గురువారం వేలం నిర్వహించారు. రెండు రోజుల క్రితం గ్రామీణ ప్రాంతాల నుంచి దొంగతనంగా రెండు ట్రాక్టర్లలో బెల్లంపల్లికి ఇసుకు తీసుకువస్తుండగా ఎస్సై కె.మహేందర్ పట్టుకుని టూటౌన్‌కు తరలించారు. సదరు ట్రాక్టర్లలో ఉన్న ఇసుకకు బహిరంగ వేలం నిర్వహించగా రూ.3,200కు సుస్మిత్ అనే యువకుడు దక్కించుకున్నాడు. ఈ వేలం పాటలో రెవెన్యూ అధికారి రమేశ్ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన బల్దియా అకౌంట్ ఆఫీసర్

- మరో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కూడా
- రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

కైలాస్‌నగర్: ఓ కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించేందుకోసం లంచం డిమాండ్ చేసిన ఆదిలాబాద్ మున్సిపల్ ఉద్యోగులు ఇద్దరిని ఏసీబీ అధికారులు గురువారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ జి.మధు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ జిల్లాల సంతోష్ మున్సిపల్ పరిధిలో రూ.60లక్షల విలువైన సీసీ రోడ్లు, హైమాస్ట్ లైటింగ్ పనులు చేశారు. పనులకు సంబంధించి రూ.3.80లక్షల చెక్కు ఇచ్చేందుకు మున్సిపల్ అకౌంట్ సెక్షన్ ఆఫీసర్(ఏవో) బట్టల రాజ్‌కుమార్‌గౌడ్, ఔట్సోర్సింగ్ ఉద్యోగి కంప్యూటర్ ఆపరేటర్ కొండ్ర రవికుమార్ రూ.20 వేలు డిమాండ్ చేశారు. రూ.15 వేలు ఇచ్చేలా వారితో కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. సదరు ఉద్యోగుల తీరుతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రూ.15 వేలు కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా మున్సిపల్ కార్యాలయంలోని అకౌంట్ సెక్షన్‌లో మున్సిపల్ ఏవోకు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారిని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. దాడుల్లో ఏసీబీ సీఐ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన అకౌంట్ ఆఫీసర్, కంప్యూటర్ ఆపరేటర్

సిబ్బందిని లోపలే ఉంచి కార్యాలయ గదికి తాళం

- రెబ్బెన ఎంపీడీవో ఆఫీసు సిబ్బంది నిర్వాకం

రెబ్బెన: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి పనినిమిత్తం వచ్చిన ఓ వ్యక్తి లోపల ఉండగానే సదరు సిబ్బంది తలుపులకు తాళాలు వేసి వెళ్లిపోయిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఎంపీడీవో కార్యాలయంలో టీ ఫైబర్ నెట్‌వర్క్‌కు సంబంధించిన పనిచేసేందుకు వచ్చిన వ్యక్తి కార్యాలయం లోపల గదిలో పని చేసుకుంటున్నాడు. ఎంపీడీవో కార్యాలయం మూసే సమయం కావడంతో సిబ్బంది ఎంపీపీ, ఎంపీడీవో ఇతర సిబ్బంది విధులు నిర్వహించే గదులను పరిశీలించి కార్యాలయం ప్రధాన ద్వారం తలుపులు మూసి తాళం వేసి వెళ్లిపోయారు. కాసేపటికి తన పనిని ముగించుకుని కార్యాలయం నుండి బయటకు వచ్చేందుకు ప్రధాన ద్వారం వద్దకు వచ్చే సరికి ప్రధాన ద్వారం తలుపులు తెరుచుకోలేదు. దీంతో విషయాన్ని తన తోటి సిబ్బందికి సమాచారం అందించాడు. వారు ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి తెలపడంతో వెంటనే సిబ్బందిని పంపించి కార్యాలయం తలుపులు తెరవడంతో సదరు వ్యక్తి బయటకు వచ్చాడు. ఈ విషయపై కార్యాలయ సూపరింటెండెంట్ వాసుదేవ్‌ను వివరణ కోరగా టీ ఫైబర్ నెట్‌వర్క్ పని చేసేందుకు వచ్చే సిబ్బంది సమయ పాలన పాటించకుండా కార్యాలయానికి వస్తూ వెళ్తుంటారని, గురువారం సాయంత్రం కార్యాలయం మూసే సమయంలో వచ్చి పనులు చేసుకుంటూ ఉండగా గమనించకుండా కార్యాలయ సిబ్బంది తాళం వేసినట్లు ఉన్నారన్నారు. వ్యక్తి లోపల ఉన్నట్టు వెంటనే విషయం తెలుసుకుని కార్యాలయం తలుపులు తెరిచామన్నారు.



గదిలో ఉన్న టీ ఫైబర్ నెట్‌వర్క్ సిబ్బంది